ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

తుపాన్ సహాయక చర్యలు

విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

- ఎన్యుమరేషన్ పారదర్శకంగా నిర్వహించి ప్రతి ఒక్కరికీ సాయం అందించాలి..
- శాశ్వత ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలి..
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మొంథా తుపాన్ మిగిల్చిన అపార నష్టాన్ని సకాలంలో అంచనా వేసి బాధితులం దరకీ తక్షణ సాయం అందించడంతో పాటు శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆదివారం నాడు స్థానిక సుందరయ్య భవన్‌లో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు మాట్లాడారు. తుపాన్ ప్రభావం వల్ల జిల్లా కకావికలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెల్లడించిన తుఫాన్ నష్టం వివరాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 25,685 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు పేర్కొన్నప్పటికీ, వాస్తవానికి ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా పత్తి, సజ్జ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు కూడా రైతుల నష్టపోయారని తెలిపారు. తీరప్రాంతాల్లో రొయ్యల చెరువులు, ఉప్పు కొటార్లు ముంపునకు గురయ్యాయని చెప్పారు. వరదల వల్ల పశ్చిమ ప్రాంతంలో పశువులు, గొర్రెలు, ▶ 2లో

పంట నష్టం 11,687 హెక్టార్లు.!



మార్కాపురం మండలం, నికరంపల్లిలో దెబ్బతిన్న మిర్చి

- రెండ్రోజుల్లో పూర్తిస్థాయి ఎన్యూమరేషన్: జేడీఏ
- గరిష్టంగా హెక్టారుకు రూ.17 వేలు పరిహారం
- పంట బీమాపై ఇంకా స్పష్టత లేదంటోన్న అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో మొంథా తుఫాను పంటలను ముంచేసింది. ప్రాథమిక అంచనాల్లో 23 వేల హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించిన వ్యవసాయశాఖ అధికారులు ముంపు వీడాక పొలాల్లోకి వెళ్లి ఎన్యూరేషన్ మొదలుపెట్టారు. ఇప్పుడు పూర్తిగా దెబ్బతిన్న పంటలు ఏ స్థాయిలో ఉన్నాయనేది తేల్చారు. పూర్తిస్థాయి ఎన్యూమరేషన్ మరో రెండ్రోజుల్లో పూర్తవుతుందని జేడిఏ శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు అన్ని పంటలు కలిపి 11,687 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు.అయితే రైతువారీగా, పంటలవారీగా ఎంత నష్టమనే వివరాలు క్షేత్రస్థాయి నుంచి రాలేదు. దెబ్బతిన్న పంటలకు హెక్టారుకు గరిష్టంగా పంటలను బట్టి రూ.17 వేలు పరిహారం రానుంది. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

తుపాన్ వల్ల పంట నష్టం తీవ్రంగానే ఉంది. ఎక్కువగా పశ్చిమ ప్రాంతంలోనే ఈ నష్టం కనిపిస్తోంది. పత్తి, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ, సజ్జ, జొన్న తదితర పంటలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వీటినే నష్టపరిహారం కిందకు చేర్చారు. పత్తి తీస్తున్నారు. కాయలు, పత్తి తడిసిపోయింది. పత్తి గుడ్డి పత్తిగా మారనుంది. మిరపకాయలు రాలిపోయాయి. మొక్కజొన్న కంకులు తడిసిపోయాయి. సజ్జ కంకులు బాగా వచ్చాయి. ఇవి కూడా తడిచి నల్లగా మారుతున్నాయి. వరి ఓదెలు కడుతున్నాయి. వేరుశనగ కూడా వేర్లకు కాయలు వస్తున్నాయి. ఈ పంటలన్నీ ఎందుకూ పనికి రాకుండా దెబ్బతిన్నాయి. కొంత కోలుకుని దిగుబడి వచ్చేలా ఉండటంతో నష్టం నుంచి తప్పించారు. వర్షాలకు పొలాల్లో నీరు చేరింది. ఉరకెత్తి పోతున్నాయి. తూర్పు ప్రాంతంలో శనగ, పొగాకు వంటివి సాగు ▶ 2లో



సభలో అభివాదం చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల

ప్రైవేటీకరణ తగదు..

- రాష్ట్రంలో వైద్యం వ్యాపారంగా మారింది..
- ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రమేష్

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆధీనంలోని 10 మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడాన్ని అధికార కూటమి పార్టీలు మినహా సిపిఎం, సిపిఐతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఓ వైపు ఉద్యమాలు కూడా చేపట్టాయి. ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణ కమిటీతో పాటు వామపక్ష పార్టీల నేతలు, ఇతర ప్రజా సంఘాల నేతలు మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద నిర్మాణ దశలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆదివారం సందర్శించారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో ప్రముఖ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ పి.వి.రమేష్ మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదన్నారు. ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైద్యం వ్యాపారంగా మారిందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ వైద్యం కూడా అందుబాటులో ఉండాలన్నారు. కార్పొరేట్ వైద్యం పేద, మధ్య తరగతి ప్రజలను అప్పుల్లో ముంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యంతో పాటు వైద్య విద్య ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ వైద్యం అందని ద్రాక్షలా మారనుందని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా జీవించే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఉందన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం వైద్య, ఆరోగ్య రంగాలను ప్రైవేట్ పరం చేసి జీవించే హక్కును హరిస్తుందన్నారు. రూ.3 లక్షలా 29 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌గా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలపై, ఆసుపత్రులపై రూ.4 వేల కోట్లు వెచ్చించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. రాష్ట్రంలో 33 శాతం ▶ 2లో

బీచ్‌లకు రావొద్దు.: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మొంథా తుపాన్ ప్రభావం వల్ల బాపట్ల జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌ల వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అందువల్ల కార్తీక మాసంలో భాగంగా సోమవారం చీరాల వాడరేవు, రామాపురం, సూర్యలంక బీచ్‌లను మూసివేశామని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదివారం రాత్రిలో ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని పర్యాటకులు గమనించి సోమవారం ఈ బీచ్‌లకు రావద్దని కోరారు.

మూలపాలెం వైపు జల్లెళ్లమూడి బ్రిడ్జి వద్ద పడిన గండి



'నల్లమడ ఆధునీకరణ'లో

తీవ్ర నిర్లక్ష్యం.!

▶ 7లో

పంట నష్టం 11,687 హెక్టార్లు.!

(మొదటిపేజీ తరువాయి)

కాలేదు. జాప్యం జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో పంటనష్టం పెద్దగా కనిపించలేదు. తీరప్రాంత మండలాల్లో వేరుశనగ దెబ్బతింది. కూరగాయలకు నష్టం జరిగింది. ఇక రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. పంటల బీమా ఎంతమేరకు వస్తుందనేది స్పష్టత లేదు. పంట నష్టం జరిగిన తీరు, నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలి. పైగా పంటల బీమాలో సాగుచేసిన పంటలనే వేశారా? లేదా? అనేదీ కీలకం. అన్ని విధాలా నమోదు ప్రక్రియ సజావుగా ఉండాలి. పైగా బీమా కంపెనీలు ప్రీమియం కట్టించుకునేటప్పుడు ఏ నిబంధనలూ చెప్పవు. పరిహారం విషయానికి వచ్చే సరికి ఏదో రకంగా ఎగనామం పెట్టేందుకే ప్రయత్నాలు చేస్తాయి. ఇప్పుడూ ఇదే జరుగుతుందనే అనుమానం ఉంది. పంట బీమా కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తుపాన్ సహాయక చర్యలు విస్తృతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మేకలు మృతి చెందాయన్నారు. ఒంగోలు నగరంలోనే ఒక్క రోజులో 25.72 సెంటీమీటర్ల భారీ వర్షం వల్ల 25 కాలనీలు మునిగిపోయాయని పేర్కొన్నారు. సుమారు 20 వేల మంది పునరావాస కేంద్రాలు, బంధువుల ఇళ్ళలో ఆశ్రయం పొందారని వివరించారు. ఒంగోలు నగర పరిధిలోనే 10 వేలకుపైగా కుటుంబాలు నిత్యావసర వస్తువులు, టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్లు, వంటి గహెూపకరణాలు కోల్పోయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్లు కేవలం 9,051 కుటుంబాలకు మాత్రమే నష్టం నమోదు చేయడం పట్ల తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. అధికారులు ఎన్యుమరేషన్ ప్రక్రియను పున్ణసమీక్షించి, పూర్తి స్థాయిలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికి పంట, ఆస్థి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రకటించిన బాధితుల కుటుంబాల సంఖ్య సరికాదన్నారు. తీర ప్రాంత మండలాలు కొత్తపట్నం, సింగరాయకొండలో ఎక్కువ గ్రామాలు, ఒంగోలు, నాగులుప్పలపాడు, టంగుటూరు మండలాల్లో కొన్ని గ్రామాలు ముంపునకు గురై, మంత్రి డాక్టర్ డిఎస్ బివి స్వామి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా స్థాయి అధికారులు, శాసనసభ్యులు విస్తృతం గా పర్యటించి ఆయా గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం సాయం అందిస్తుందని భరోసా కల్పించి తీరా సాయం అందించే సమయానికి బాధితుల సంఖ్యను కుదించడం సరికాదని హితవు పలికారు. తుఫాన్ నేపథ్యంలో తమ పార్టీ కార్యకర్తలు కూడా ముంపు ప్రాంతాల్లో పర్యటించారని, జరిగిన నష్టాన్ని తమ పార్టీ కూడా అంచనా వేసిన అంశాన్ని గుర్తుకు తెచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి సమగ్రమైన సర్వే చేపట్టి ప్రతి బాధితునికి సాయం అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన బాధితుల తరపున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కాగా తరచూ ఒంగోలు నగరాన్ని ముంచెత్తుతున్న పోతురాజు కాలువ, నల్లవాగు ఆక్రమణలు తొలగించి అభివద్ధి పరచలన్నారు. నల్లవాగు ప్రారంభం నుంచి సముద్రంలో కలిసే వరకు తేటుపురం, గుండమాల ప్రాంతాల్లో నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమించారని, రొయ్యల సాగు జరుగుతోందని మాబు ఆరోపించారు. ఈ ఆక్రమణలను వెంటనే తొలగించకుంటే భవిష్యత్తులో మరింత తీవ్రమైన వరద ముప్పు తప్పదని హెచ్చరించారు. ఈ రెండు కాలువల ఆక్రమణలు తొలగించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

అదేవిధంగా గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి ఒకే సారి నీరు విడుదల చేయడంతో మద్దిపాడు, కొలచనకోట, నాగన్నపాలెం, వెల్లంపల్లి, ఏడుగుళ్ళపాడు, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు తదితర గ్రామాలు ముంపుకు గురయ్యాయన్నారు. పలు చోట్ల చెరువులకు గండ్లు పడటం, వంతెనలు కూలిపోవడం విద్యుత్ స్తంబాలు పడిపోవడంతో పాటు కురిచేడు మండలం బోదనంపాడులో కొత్తగా నిర్మించిన మంచినీటి ట్యాంకు కుప్పకూలిపోయిందన్నారు. ఇటువంటి తుఫాన్ సహాయక చర్యలతో పాటు భవిష్యత్తులో శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజల నష్టాలను పూడ్చడంలో నిర్లక్ష్యం చూపితే ప్రజలను కదిలిస్తామని పార్టీ జిల్లా కమిటీ హెచ్చరించింది. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, ఎం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్ కోసం ఎల్ఇడి స్క్రీన్

ప్రజాశక్తి-దర్శి

భారత మహిళా క్రికెట్ టీం ఫైనల్‌కు చేరుకున్న సందర్భంగా ఐసీసీ మహిళా క్రికెట్ వరల్డ్ కప్ ఇండియా మరియు సౌత్ ఆఫ్రికా ఫైనల్ మ్యాచ్ సందర్భంగా మహిళలలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు దర్శి టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో దర్శి పట్టణం గడియార స్థంభం సెంటర్‌లో లైవ్ టెలికాస్ట్‌ను దర్శి నగర ప్రజలు వీక్షించేందుకు అనువుగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి బిగ్ డిజిటల్ ఎల్‌సిడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ లైవ్ మ్యాచ్‌ని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దర్శి పట్టణంలోని ప్రజానీకంతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎస్ఐ మురళి, టిడిపి నాయకులు సానే సుబ్బయ్య, కర్ణ శ్రీను, పట్టణంలోని కూటమి శ్రేణులు ఉన్నారు.


బిగ్ డిజిటల్ ఎల్‌సిడి స్క్రీన్

కోటి సంతకాలతో..

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ వైసిపి ఆధ్వర్యంలో జరుగుతోంది. మార్కాపురం మున్సిపాలిటీలోని ఐదో వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం జరిగిన కోటి సంతకాల సభలో ముఖ్య అతిథిగా వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వైద్యంతో అందరికీ నష్టమేనన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ప్రభుత్వ వైద్యంతో పాటు వైద్య విద్య అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు కోటి సంతకాల సేకరణ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. కోటి సంకాలతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ షేక్ సలీం, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషీర్‌అలీబేగ్, ఎఎంసి మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు ముత్తారెడ్డి వెంకటరెడ్డి, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, గొలమారి శివారెడ్డి, గొలమారి సత్యనారాయణరెడ్డి, కురాటి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

ప్రైవేటీకరణ తగదు

(మొదటిపేజీ తరువాయి)

బాల, బాలికలు పౌష్టిక ఆహార లోపంతో అనారోగ్య పాలవుతున్నారని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తే 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చేకూరుతాయని చెప్పారు. రిజర్వేషన్లు అమలు ద్వారా సామాజిక న్యాయం వికసిస్తుందన్నారు. సగటున ఒక్కొక్క ప్రైవేట్ మెడికల్ కాలేజీ ప్రతి ఏడాదీ రూ.100 నుండి రూ. 150 కోట్ల లాభాలు గడిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసి, కార్పొరేట్ శక్తులకు అందిస్తే ఏడాదికి రూ.1500 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు. పిపిపి అంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడమేనని పేర్కొన్నారు. మార్కాపురం మెడికల్ కళాశాల 53 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉందన్నారు. మెడికల్ కళాశాలలో భాగమైన బాలికల వసతి గృహం 80 శాతం పూర్తయిందన్నారు. బాలుర వసతి గృహం 60 శాతం నిర్మాణం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల 50 శాతం పని జరిగిందన్నారు. వైద్యశాల నిర్మాణ పనులు 20 శాతం జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎలాంటి పని జరగలేదన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ప్రపంచంలో అనేక దేశాలలో అమల్లో ఉన్న విధంగా విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. అప్పుడే పేదలకు, బడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం 107, 108, జీవోల ద్వారా ప్రభుత్వ మెడికల్ సీట్లను అమ్ముకునే విధానం ప్రవేశ పెడితే నేటి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను నిసిగ్గుగా అమ్ముకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత 16 నెలలుగా కూటమి ప్రభుత్వం అభివద్ధి పేరుతో ప్రభుత్వ ఆస్తులను, విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని, ఈ ప్రక్రియలో భాగంగానే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు చెందిన 600 ఎకరాలను నిర్మాణంలో ఉన్న భవనాలను కార్పొరేట్ వైద్య సంస్థలకు కారు చౌకగా కట్ట బెడుతుందన్నారు. ఈ అక్రమ విధానాలను ప్రజలు గమనించాలని, అవసరమైతే ప్రతిఘటించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమల ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ 590 జీవో ద్వారా 66 సంవత్సరాల పాటు వైద్య వ్యాపారంలో లాభాలను గడించడానికి అవకాశం కల్పిస్తుందని, తక్షణమే 590 జీవో రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదని చెబుతూనే మరొకవైపు పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుకు రూ. 80 వేల కోట్లు ఖర్చు చేయడానికి ఆరాట పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత ఉద్యమ నేత కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ రాజ్యాంగ వ్యతిరేక శక్తులు నేడు పాలకులుగా మారి, ప్రభుత్వ వనరులను కబ్జా చేస్తున్నారని, అందులో భాగంగానే పిపిపి అనే దొడ్డిదారితో విలువైన ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు విశేష వైద్య సేవలు అందించగా ప్రైవేట్ ఆసుపత్రులు మాత్రం ప్రజలను నిలువు దోపిడి చేశాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల కో కన్వీనర్ డాక్టర్ వసుంధర కుర్ర, హైకోర్టు న్యాయవాది శ్రీదేవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్, సిపిఐ జిల్లా నాయకులు అందే నాసరయ్య, సిపిఎం జిల్లా నాయకులు డి.సోమయ్య, దళిత, బిసి సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

జోగి రమేష్ అరెస్టు కక్ష సాధింపు చర్య

ప్రజాశక్తి-కొండపి

మాజీమంత్రి జోగి రమేష్ అరెస్టు కక్ష సాధింపు చర్యలో భాగమేనని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఘటన పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం కుటీల రాజకీయాన్ని చేస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న నకిలీ మద్యం కేసులో జోగి రమేష్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా టీడీపీలోని అసలు నిందితులను వదిలేసి ప్రభుత్వం కొత్త నాటకం ఆడుతుందాన్నారు.

హాస్పిటల్లో పెన్షన్ పంపిణీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని గాదపాలెం గ్రామంలో పెన్షనర్ తానిపర్తి నాగిరెడ్డి మూడు నెలలుగా విజయవాడ హాస్పిటల్‌లో సర్జరీ చేయించుకుని విజయవాడలోనే తమ బంధువుల వద్ద ఉంటున్నారు. తన స్వగ్రామం రాలేని పరిస్థితిలో ఉన్నందున మూడు నెలల పెన్షన్ ఆదివారం రూ.18 వేలను విజయవాడకు పంచాయతీ కార్యదర్శి వెళ్లి డిస్ట్రిబ్యూట్ చేయటం జరిగిందని పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తెలిపారు.


చిన్నారితో బూచేపల్లి

చిన్నారికి బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని కొమ్మవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పమ్మి వెంకటేశ్వరరెడ్డి కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సుంకర సునీత, బ్రహ్మానందరెడ్డి, బంక నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 3 నవంబర్ 2025

అద్దె భవనాలు.. అరకొర వసతులు

అవస్థల్లో వసతి గృహ విద్యార్థులు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని బిసి-2 బాలుర వసతి గృహంలో విద్యార్థులకు తగిన వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. 85 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉన్నట్లు వసతిగృహ అధికారి చెబుతుండగా అందుకు తగ్గట్లు విద్యార్థులు లేకపోవడం కోసమెరుపు. టాయిలెట్లలో పారిశుద్ధ్యం లోపించింది. వాచ్మెన్ పోస్టు ఖాళీగా ఉండడంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకగా ఉంది. అటెండర్ బదులు మరొకరు తాత్కాలిక పద్ధతిన నియమింపబడి విధులు నిర్వహిస్తున్నారు. వంట మనిషి అటెండర్ విధులు నిర్వహిస్తుండగా అటెండర్ స్థానంలో మరొకరు వంట విధులు నిర్వహించడం గమనార్హం. విద్యార్థులు ఉంటున్న గదుల రేకులు వర్షానికి కారుతున్నాయి. కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరిలో బిసి బాలుర వసతి గృహాలు 2, కళాశాల బాలికల, బాలుర వసతి గృహాలు 2, ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలు 2, సమీకృత వసతి గృహంలో 2, ఎస్టి గురుకుల పాఠశాల, కస్తూరిబా, మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వెలిగండ్ల మండలంలో బిసి1, ఎస్సీ 1 చొప్పున వసతి గృహాలు ఉన్నాయి. పీసీ పల్లిలో ఎస్సీ వసతి గృహం ఒకటి ఉంది. పామూరు మండలంలో బీసీ 1, ఎస్సీ 1 వసతి గృహాలు ఉన్నాయి. హనుమంతుని పాడు మండలంలో ఎస్సీ బాలుర వసతి గృహం1 ఉంది. సిఎస్పురం మండలంలో రెండు బీసీ, ఒకటి ఎస్సీ వసతిగృహం ఉన్నాయి. కొన్ని వసతి గృహాలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో ఉన్నాయి. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న కొన్ని వసతి గృహాల్లో వసతులు కొరవడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కొరత ఉంది.



కనిగిరిలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం



రేకుల రూములో ఉన్న విద్యార్థులు



దర్శిలోని బాలుర హాస్టల్

దర్శి బాలుర హాస్టల్లో తాగునీటికి ఇబ్బందులు

దర్శి: దర్శి లోని బాలుర వసతి గహంలో త్రాగునీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తూర్పుచౌవటపాలెం వెళ్లే రోడ్లో ఆర్అండ్బి బంగ్లా ఎదురుగా ఉన్న బాలుర కళాశాల వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థులకు సరిపడ రూమ్లు ఉన్నాయి. అదేవిధంగా మరుగుదొడ్లు కూడా ఇటీవల డోర్లు పోతే బిగించారు. అయితే విద్యార్థులకు తాగటానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పక్కనే ఉన్న ఎన్ఎపి సాగర్ నీరు మూడు రోజులకు ఒకసారి విడుదల చేస్తారు. ఆ సమయంలో తెచ్చుకున్న నీరు ఒకటి రెండు రోజుల్లో అయిపోతాయి. మిగిలిన రెండు రోజులు నీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఒక్కొక్క రోజు రూమ్లో ఉన్న విద్యార్థులు కలిపి పది రూపాయలు వసూలు చేసుకుని బబుల్ మీరు తెచ్చుకుంటున్నట్లు వారు తెలిపారు. దీనిపై హాస్టల్ వార్డెన్ రామకష్ణారెడ్డిని వివరణ కోరగా త్రాగునీరు లేని మాట వాస్తవమేనన్నారు. ప్రతిరోజు త్రాగునీరు వచ్చే విధంగా దగ్గరలో ట్యాంక్ నుండి లైన్ నేరుగా వేస్తే వస్తాయన్నారు. కానీ బోరు నీరు త్రాగుటకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో వచ్చిన వంట ఆమె తిరుపతమ్మ మొదట్లో అన్నం సరిపోకుండా ఉండేదని విద్యార్థులు తెలిపారు. దీనిపై ఆమెను ప్రజాశక్తి వివరణ కోరగా ప్రస్తుతం సరిపడా అన్నం వండుతున్నామని అవసరమైతే మరల వండి పెడుతున్నట్లు ఆమె తెలిపారు. ఇక్కడే ఉండి విద్యార్థుల కోసం సాయంత్రం వరకు పనిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. మొత్తం 80 మంది విద్యార్థులు ఉన్నారని ఒక విద్యార్థికి ఒక పూటకు 200 గ్రాములు చొప్పున బియ్యం ప్రభుత్వం ఇస్తుందని రామకష్ణారెడ్డి తెలిపారు. అయితే విద్యార్థులు కాలేజీ పిల్లలు కనుక వారికి కొంత మందికి సరిపోదన్నారు. అయితే బయోమెట్రిక్ కారణంగా విద్యార్థులకు ఒక్కోసారి ఎక్కువ ఇవ్వాలన్నా కుదరడం లేదని తెలిపారు. ఆదివారం రోజున చికెన్ 100 గ్రాములు చొప్పున విద్యార్థులకి తెప్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ హాస్టల్లో తాగనీరు మాత్రమే లేదన్నారు.

మహిళపై కత్తితో దాడి

ప్రజాశక్తి-కనిగిరి



గాయపడిన సుబ్బులు

మహిళపై యువకుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన కనిగిరి పట్టణంలోని సాయిబాబా హాల్ ఎదురు బజారులో శనివారం ఉదయం జరిగింది. ఇంట్లో పూజ చేసుకుంటున్న రాచగుండ్ల సుబ్బులు అనే మహిళపై పండ్లు అమ్ముకునే శివ అనే యువకుడు ఆకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో మహిళకు గాయాలు కావడంతో ఆమెను తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనను గమనించిన ప్రజలు మరియు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అప్రమత్తంగా స్పందించి, ఆ యువకుడిని వెంటనే పట్టుకుని ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని పోలీస్ స్టేషనులో అప్పగించారు. కనిగిరి ఎస్సై శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా బాధితురాలు సుబ్బులు, నిందితుడు శివ ఇద్దరూ పండ్ల వ్యాపారం చేస్తుంటారు. వ్యక్తిగత గొడవల కారణంగానే ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని సుందర్నగర్లో ఆదివారం నాడు పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు. సుందర్ నగర్లో ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి, అధికారులు

స్కూల్ గేమ్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగ ననున్న అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ టోర్నమెంట్ నవంబర్ 23, 24, 25 తేదీల్లో ప్రకాశం జిల్లా శింగరాయకొండలోని ఎఆర్ సీ-జివిఆర్ జూనియర్ కాలేజీలో జరుగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ క్రీడాపోటీల పోస్టర్ని తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాదికారి కె.ఆంజనేయులు, జరుగుమల్లి పిడి ప్రసాద్, కె.ఉప్పలపాడు పిడి కిరణ్, వెన్నూరు పిడి చంద్రశేఖర్, నేరేడుపల్లి పిడి నాగేశ్వరరావు, బసిరెడ్డిపాలెం పిడి బలరామ్, సియస్పురం పిడి నక్కా శ్రీనివాసులు, శింగరాయకొండ పిడి శంకరరావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

అల్లూరులో వైసీపీ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో వైసీపీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా బస్టాండ్ సెంటర్లో ఆదివారం సంతకాలు సేకరించడం జరిగింది. ఈ సంద ర్భంగా ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులకు దోచిపెట్టే కార్యక్రమం తలపెట్టిందని అందులో భాగంగానే ఒక ఎకరం 100 రూపాయలకు లీజుకు ఇస్తుందని తెలియ జేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం అయితే పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడం కష్టతరం అవుతుం దని దీనిని ప్రజలు గుర్తించాలని తెలియజేశారు. వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఏడు మెడికల్ కాలేజీలు పూర్తి స్థాయిలో పూర్త య్యాయని మిగిలిన పది కాలేజీలు సగంలోనే ఆగాయని వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదని ఆయన అన్నారు. రాష్ట్ర మొత్తం సంతకాలు సేక రించి గవర్నరుకు సంతకాలతో కూడిన అర్జీని ఇవ్వాలని తెలియజేశారు. ఆరోగ్యశ్రీని పూర్తిగా పక్కన పడేశారని, అనేకమంది పేదలు ఆరోగ్యశ్రీ ద్వారానే వైద్య సేవలు పొందుతున్నారని ఆయన తెలియజేశారు. ప్రభుత్వ వెంటనే ఆరోగ్యశ్రీని అన్ని ఆసుపత్రులకు వర్తింపజేసి పేదలకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, అ ల్లూరు సీనియర్ నాయకులు వి ఆర్ సి రెడ్డి ఎంపీటీసీ శాంతారావు సర్పంచ్ నంబూరి సూర్యనారా యణ, హరి చిట్టిబాబు,జిల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు


దాతృత్వం చాటుకున్న టీడీపీ నేత ప్రభాకర్ రావు

ప్రజాశక్తి-జరుగుమల్లి

మొంథా తుఫాను వలన కురిసిన భారీ వర్షాలు కారణంగా మల్లవరప్పాడు, కారుమంచి గ్రామం మధ్యలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కారుమంచి-మల్లవరప్పాడు రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పరిశీలించి వెళ్ళారు. కారుమంచి గ్రామం నుంచి మల్లవరప్పాడు మీదుగా ఒంగోలు వెళ్ళాలంటే తారు రోడ్డు ఇనగలేరు వరద ఉధృతికి కోసుకు పోయి తారు రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. ఈ కారణంగా, వాహనాలు పోవుటకూ అంతరాయం కలిగింది. గ్రామస్తులు ఇబ్బందిని గుర్తించిన, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈదర ప్రభాకర్ రావు సొంత నిధులతో ఆదివారం గ్రావెల్ తోలించి, జెసిబితో రోడ్డు వెడల్పు చేయించారు. దీంతో వాహనాలు రాక పోకలకు అంతరాయం అయింది. గ్రామస్తులు ఈదర ప్రభాకర్కి కతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాస్, బీసీ నాయకులు ఆత్మకూరు శ్రీనివాసరావు, మేడికొండ రవీంద్ర, టైగర్ శీను, మేడికొండ శ్రీను, టీడీపీ నాయకులు రోడ్డు పనిని పర్యవేక్షించారు.



గ్రావెల్ తోలి మరమ్మమతులు చేసిన కారుమంచి రోడ్డు



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసాద్ రావు

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మద్దిపాడు : వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని క్లస్టర్ ఇన్చార్జి, ఉప సర్పంచ్ దేవభక్తుని ప్రసాద్ రావు అన్నారు. మండల పరిధిలోని కొలచనకోట గ్రా మంలో వరద బాధితులకు నగదు నిత్యావసర సరుకులు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా పునరావాస కేంద్రంలో ఉన్న 23 మత్స్యకార కుటుం బాలకు ప్రభుత్వం ఇస్తున్న నగదు, నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్య క్షులు గంటా శ్రీనివాసరావు, కార్యదర్శి మీరా, వీఆర్వో సుధాకర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయల ధరలు

- కేజీ రూ.100 దాటిన వైనం..
- రైతుకు దక్కని ధరల ఫలితం
- జేబులు నింపుకుంటున్న దళారులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

తెలుగు రాష్ట్రాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో పాటు మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వివిధ పంటలతో పాటు ఉద్యాన పంటలైన కూరగాయల పంటలు దెబ్బ తిన్నాయి. దీంతో గత నాలుగు రోజులుగా కూరగాయల ధరలు మండుతున్నాయి. కూరగాయలు కొని వండుకునే పరిస్థితి లేకుండా పోయింది. మార్కెట్లలో వంకాయ, బెండకాయ, క్యారెట్, పచ్చిమిర్చి కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కూరగాయలు ఏది చూసిన కేజీ రూ.80పై మాటే పలకుతున్నాయి. వారం క్రితం కేజీ రూ.3లకు రైతుల వద్ద ధర పలికిన టమోటా ప్రస్తుతం కేజీ రూ.50కి రిటైల్ అమ్మకం చేస్తున్నారు. పప్పు చిక్కుళ్ళు, బీరకాయ, దోసకాయ, పొట్లకాయ, కాకరకాయలు ధర వచ్చిన కాడికి వసూళ్లు చేస్తున్నారు. ఉదయం కూరగాయలు తాజాగా ఉన్న సమయంలో రూ.80 చెబుతూ సాయంత్రంకు కేజీ రూ.70కి కొంత మంది ఇస్తున్నారు. అమ్మకం దుకాణదారులను ధరలు ఎంతని వినియోగదారులు అడిగితే వర్షం ప్రభావంతో కూరగాయల తోటలన్ని దెబ్బతిన్నాయని చెబుతున్నారు. హెూల్సేల్ ధరలే తమకు ఎక్కువగా వేస్తున్నారని, తాము కేజీకి రూ.10 మాత్రమే లాభం చూసుకొని ఇస్తున్నామని తెలిపారు. కూరగాయలతో పాటు ఆకుకూరల ధరలు మండిపోతున్నాయి. కూరగాయల ధరలకు ఇంకొల్లు, మార్టూరు, పర్చూరు ప్రాంతమే కాకుండా వర్షం పడిన అన్ని జిల్లాల్లో ఇదే పలుకుతుందని చెబుతున్నారు.


ఇంకొల్లు మార్కెట్లో కూరగాయలు

పూల ధరలకు రెక్కలు

వర్షాల ప్రభావంతో పూల సాగు దెబ్బతినది. దీంతో పూల మార్కెట్లో బంతి, చామంతి పువ్వుల ధరలకు రెక్కలు వచ్చాయి. కార్తీక మాసంలో మహిళలు వివిధ ఆలయాల్లో పూలతో పూజలు చేస్తుంటారు. అయ్యప్ప, శివ, దుర్గ భవాని మాలలు ధరించే స్వాములు విరివిగా పూజలు వాడుతారు. సహజంగానే ఈ నెలలో పూల ధరలు ఎక్కువగా ఉంటాయి. వర్షాలకు ముందు వరకు కేజీ రూ.50 నుంచి రూ.70 అమ్మిన బంతిపూలు ప్రస్తుతం రూ.100 పైనే అమ్ముతున్నారు. కనకాంబరాలు, చామంతి పువ్వులు, ఆకు ధరలు ఎక్కువగా ఉన్నాయి.

అరటి పండ్లకు గిరాకీ

వర్షం ప్రభావంతో అరటి పళ్ళు ధరలు పెరిగాయి. వర్షాలకు అరటి తోటలు కృష్ణ, గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్నాయని చెబుతున్నారు. అరటి పళ్ళు డజను రూ.60 నుండి రూ.70 లోపు పలికిన మార్కెట్ ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 పలుకుతున్నాయి. ఇది ఇలా ఉంటే పంట పండించే రైతులు మాత్రం తమకు ఆ ధరలు రావడం లేదని వాపోతున్నారు. మార్కెట్‌కు తీసుకెళితే ఇప్పుడు కూడా వంకాయలు 10 కేజీలు రూ.200 నుంచి రూ.250 లోపే కొంటున్నారని తెలిపారు. బెండకాయ 10 కేజీలు రూ.40 నుంచి రూ.55 పలుకుతుందని రైతులు తెలిపారు. కాకర, పొట్లకాయ, చిక్కుళ్ళు 10 కేజీలు రూ.40 నుంచి రకాన్ని బట్టి రూ.50 లోపే ధరపడుతుందని తెలిపారు.

మధ్య దళారులకే లాభం

ఏదేమైనా కూరగాయల ధరతో పాటు పూలు, అరటి పండ్ల ధరలకు రెక్కలు రావటం రైతులు, వినియోగ దారులకు నష్టం కలుగుతుంటే మధ్యలో కమిషన్ వ్యాపారం చేసే దళారులకు మాత్రం అధిక లాభం చేకూరుతుందని రైతులు, రిటైల్ మార్కెట్ దారులు చెబుతున్నారు. మరో వారం రోజుల పాటు ధరలు దిగివచ్చే అవకాశం లేదని అమ్మకం దారులు చెబుతున్నారు. కష్టపడి పంచిడిన తమకన్నా మధ్య దళారులే లబ్దిపొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ చూపి రైతుల వద్ద నుంచి కూరగాయలు నేరుగా మార్కెట్లలో వినియోగ దారులకు రైతులు తక్కువ ధరకు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.


ఎమ్మెల్యేని సత్కరిస్తున్న చైర్మన్ సాంబశివరావు

అందరి సమన్వయంతోనే అవార్డు

ప్రజాశక్తి - చీరాల


స్థానిక టిడిపి కార్యాలయంలో శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంలో తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు అండగా నిలిచినందుకు సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ సేవా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ అవార్డుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికారులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన నష్టాలపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మించాలా సాంబశివరావు, వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, కాళహస్తి బోర్డు సభ్యురాలు రజనీ, చీరాల, వేటపాలెం టిడిపి అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


డిఎస్పికి డ్రోన్ కెమెరా అందిస్తున్న ఫుడ్ పార్క్ ప్రతినిధి

డ్రోన్‌ల పర్యవేక్షణలో నేరాల నియంత్రణ

ప్రజాశక్తి - బాపట్ల

నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరా ఎంతగానో ఉపయోగపడుతుందని డిఎస్పి గోగినేని రామాంజనేయులు అన్నారు. సతీష్ ఫుడ్ పార్క్ అధినేత, శాసన మండలి మాజీ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ సహకారంతో ఫుడ్ పార్క్ ప్రతినిధి నరేంద్ర డ్రోన్ కెమెరా అందచేశారని తెలిపారు. బాపట్ల పట్టణం, రూరల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న వివిధ అసాంఘిక కార్యక్రమాలు గుర్తించడానికి ఉపయోగపడే డ్రోన్ కెమెరాను మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఫుడ్ పార్క్ సౌజన్యంతో అందించడం అభినందనీయమని అన్నారు. నాటు సారా కాసేవారిని, గంజాయి విక్రయాలు చేసే వారిని, పేకాట, తీర ప్రాంతాల్లో పర్యాటకులు గల్లంతు కాకుండా డ్రోన్ కెమెరా నిఘా తోపాటు సాధ్యమని అన్నారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రోన్ కెమెరా ఉపయోగించి నేరాల నియంత్రణకు కృషి చేస్తారని తెలిపారు.


డిప్యూటి తహశీల్దారు వద్దచేర్చిన పోలీసులు

విద్యార్థులను అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ప్రభుత్వ సామాజిక సంక్షేమ బాలుర వసతి గృహం ఒకటి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు శనివారం పాఠశాలకు వెళ్లి అదృశ్యమైన ఘటనపై వార్డెన్ వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో మేదరమెట్ల బస్టాండులో ఇద్దరు విద్యార్థులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని గుర్తించి ఆదివారం స్థానిక స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇద్దరు విద్యార్థులను స్థానిక డిప్యూటీ తహశీల్దారు వద్దకు తీసుకెళ్లారు. విద్యార్థులను వెతికిన సిబ్బందిని సిఐ ఎ సుబ్బరాజు అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - రేపల్లె

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బాధ్యతా భావం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించడం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఉద్దేశ్యమని ఎజిఎం శివ నాగరాజు అన్నారు. పట్టణంలోని నారాయణ ప్రైమరీ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల ముందు తమ ప్రతిభ చాటుకున్నారు. విద్యార్థులు తమ పాఠశాల్లో నేర్చుకున్న పాఠ్యాంశాలు, ప్రాజెక్టులు, సృజనాత్మక పనులను స్వయంగా వివరించారని తెలిపారు. అభ్యాసన పద్ధతి, అభివృద్ధి, బలహీనతలు, భవిష్యత్ లక్ష్యాలు తల్లిదండ్రులతో చర్చించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు తరగతుల్లో తిరుగుతూ తమ పిల్లల ప్రదర్శనలు వీక్షించి, టీచర్లతో మాట్లాడి విద్యార్థుల పురోగతిపై చర్చించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. పిల్లలు తమ అభ్యాసాన్ని తల్లిదండ్రులకు వివరించడం ద్వారా బాధ్యతాయుతమైన విద్య విధానాన్ని అభివృద్ధి చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అంబటి సత్యప్రసాద్, కోఆర్డినేటర్ ఖమర్ జహాన్, బేబిరాణి పాల్గొన్నారు.


నారాయణ పాఠశాల్లో కాన్ఫరెన్స్ పరిశీలిస్తున్న దృశ్యం

కార్తీక స్నానాలకు అనుమతి లేదు

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని నిజాంపట్నం హార్బర్ నందు భక్తులు కార్తీక మాసం సందర్భంగా సోమవారం సముద్ర స్నానంకు అనుమతి లేదని ఎస్ఐ కందుల తిరుపతిరావు తెలిపారు. మొంత తుఫాను ప్రభావంతో సముద్ర తీరం కోతకు గురై ప్రమాదకరంగా మారి నందున స్నానం ఆచరించుటకు వెళితే ప్రాణహాని ఉందని హెచ్చరించారు. కావున సోమవారం తాత్కాలికంగా బీచికు వెళ్లే రహదారి మూసి వేస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు, ప్రజలెవరూ సముద్ర స్నానానికి రావద్దని తెలిపారు.

ఇంకొల్లు : కార్తీక మాసం సముద్ర స్థానాలకు ప్రజలు వెళ్లవద్దని ఎస్ఐ జి సురేష్ తెలిపారు. తుఫాను కారణంగా సముద్రం అల్ల కల్లోలంగా ఉందని అన్నారు. ఉన్నత అధికారులు, చీరాల డిఎస్పి మహమ్మద్ మెయిన్, సీఐ వి రమణయ్య ఆదేశాల మేరకు సముద్ర స్థానాలు మరో మూడు రోజులపాటు రద్దు చేసినట్లు తెలిపారు. కావున చీరాల పరిధిలోని ఓడరేవు, రామాపురం, పొట్టి సుబ్బాయ పాలెం ప్రాంతాలకు కార్తీకమాసం స్నానాలకు వెళ్ళవద్దని తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా నిషేధిస్తున్నట్లు తెలిపారు.



నిజాంపట్నంలో రోడ్డుకు బారికేట్లు పెట్టిన పోలీసులు

కొల్లూరు : మండలంలోని చిలుమూరు శివాలయం వచ్చే భక్తులు కృష్ణానది వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున కార్తీక మాస స్నానాలు ఆచరించే భక్తులకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. కావున భక్తులెవరూ నదిలో స్నానానికి వెళ్లవద్దని సూచించారు. దైవ దర్శనం చేసుకుని క్షేమంగా తిరిగి వెళ్లాలని తెలిపారు.

చీరాల : తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం వంటి సముద్రతీర ప్రాంతాల్లో కార్తీక స్నానాలకు వచ్చే భక్తులు, పర్యాటకులకు అనుమతి లేదని డిఎస్‌పి మొయిన్ తెలిపారు. వాతావరణ పరిస్థితులు అర్ధం చేసుకుని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

హనుమాజిపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని ఇంకొల్లు పంచాయతీ శివారు గ్రామమైన హవోజిపాలెంలో బత్తిన హనుమంతరావు (58) హార్ట్ స్ట్రోక్‌తో ఆదివారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఆయన కంళ్లు దానం చేశారు. గుంటూరు పెద్దకాకానికి శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కార్నియా సేకరించారు. కార్యక్రమంలో ఆయన భార్య సుమని, కుమారులు వంశీకృష్ణ, హర్ష కుమార్, బంధువులను రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, క్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల నాగేశ్వరావు అభినందించారు.


బత్తిన హనుమంతరావు

జె పాంగులూరు : మండలంకు చెందిన బూదవాడలో అలవాల నారాయణరెడ్డి (95) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన కళ్ళను కుటుంబ సభ్యులు ఆదివారం దానం చేశారు. గుంటూరు పెదకాకాని శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కంటి కార్నియా సేకరించారు. కుమారుడు రాఘవరెడ్డి, కోడలు మాధవిలత, కూతురు రాజ్యలక్ష్మి, అల్లుడు వెంకటేశ్వరరెడ్డిని ఇంకొల్లు రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు, రోటరీ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి పలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ నాగేశ్వరరావు, జెడ్పి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్రావు అభినందించారు.


నారాయణరెడ్డి

నేడు చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - పంగులూరు

69వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి చెస్, యోగ పోటీలు ఈనెల 3న సోమవారం ఒంగోలులోని యుటిఎఫ్ కార్యాలయం దగ్గర జరుగుతాయని చీరాల డివిజన్ ఎస్‌జిఎఫ్ సెక్రటరీ కె ప్రతిమ ఆదివారం తెలిపారు. ఉదయం 9కి జిల్లా స్థాయి చెస్ గవర్నమెంట్ సెలక్షన్స్ అండర్ –14, 17 బాలుర, బాలికలకు జరుగు తాయని అన్నారు. మధ్యాహ్నం 2గంటలకు యోగ అండర్ –14, 17 బాలురు, బాలికలకు పోటీలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక కూడా జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలకు అర్హులైన విద్యార్థులు పాల్గొనాలని కోరారు. వివరాలకు డిఆర్ఆర్ఎంఎం పిడిని సంప్రదించాలి తెలిపారు.

ప్రజాశక్తి 5
సోమవారం 3 నవంబర్ 2025



పుష్కరిణిలో తెప్పోత్సవం

వైభవంగా 'చెన్నకేశవ' తెప్పోత్సవం

భారీగా తరలివచ్చిన జనం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి తెప్పోత్సవ వేడుక అంగరంగ వైభవంగా ఆదివారం రాత్రి జరిగింది. సమీప కోనేటివీధిలోని పుష్కరిణిలో ఈ వేడుక నిర్వహించారు. తెప్పోత్సవ వేడుకను తిలకించేందుకు పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలి రావడం జరిగింది. ప్రతిఏటా కార్తీక మాసంలో ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరిణిలో (కోనేరు) నీటిపై తెప్పను నిర్మించారు. శాశ్వత ఉభయదాతలుగా వ్యవహరిస్తున్న డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ కుటుంబీకులు ఈ వేడుకను అత్యంత వైభంగా నిర్వహించడం జరుగుతోంది. తెప్పోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ప్రత్యేక అలంకరణతో నీటిపై ఏర్పాటు చేసిన తెప్పోత్సవం అలరించింది. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, ఇతర అధికారులు పాల్గొనగా ఆలయ కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి వేడుకలను పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు నిర్వహించారు.

భారీ పోలీస్ బందోబస్తు..

శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి తెప్పోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది. డిఎస్‌పి డాక్టర్ యు.నాగరాజు, మార్కాపురం సిఐ పి.సుబ్బారావు నేతృత్వంలో పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు, మార్కాపురం రూరల్ ఎస్ఐ పి.అంకమరావు తదితరులు బందోబస్తు పర్యవేక్షించారు.



జెండాను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీ నగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో జెండా ఆవిష్కరణ గావించారు. ఎస్.కె.పీరు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు మాట్లాడుతూ 1980 నవంబర్ 1 నుంచి డివైఎఫ్ఐ యువత హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ వస్తోందన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మోదీ ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను దెబ్బతీసి నిరుద్యోగాన్ని పెంచిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగభతి హామీ కూడా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో విభజన హామీలు, ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ల సాధన కోసం పోరాటాలను ముమ్మరం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు టీ.దాసు, కె.గురవయ్య, టి.సురేష్, సిఐటియు నాయకులు ఎస్.డి.హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌ల వద్దకు ప్రవేశం లేదు..

- అక్కడ కార్తీక స్నానాలు నిషేధం
- అధికారుల ప్రకటన



చీరాలలో వాడరేవు తీరం వద్ద పర్యటిస్తున్న ఆర్టీవో చంద్రశేఖర్ నాయుడు

ప్రజాశక్తి-బాపట్ల

వాతావరణం అనుకూలించని కారణంగా బాపట్ల జిల్లాలోని బీచ్‌ల వద్దకు ప్రజలకు ప్రవేశం లేదని అధికారులు ప్రకటించారు. కార్తీక స్నానాల కోసం బీచ్‌ల వద్దకు ఎవరూ రావద్దని తెలిపారు.

– కార్తీకమాసం సందర్భంగా సముద్ర స్నానాలకు సూర్యలంక బీచ్ వద్దకు ఈ నెల 4 వరకు పర్యాటకులకు అనుమతించడం లేదని బాపట్ల ఆర్డీవో గ్లోరియా ఆదివారం తెలిపారు. మొంథా తుఫాను ప్రభావంతో సముద్రంలో భారీ గుంతలు ఏర్పడిన కారణంగా పర్యాటకుల భద్రత దష్ట్యా అధికారుల పరిశీలన అనంతరం సూర్యలంక బీచ్‌కు పర్యాటకులు అనుమతించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

– బాపట్ల సూర్యలంక బీచ్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణం అనుకూలించకపోవడంతో పాటు, మత్స్య శాఖ, రెవిన్యూ అధికారుల సూచనల మేరకు సూర్యలంక, బాపట్ల మండలం పాండురంగపురం బీచ్‌కు పర్యాటకులను అనుమతించడం లేదని తెలిపారు. వాతావరణం అనుకూలత, మత్స్య, రెవెన్యూ శాఖల అనుమతుల మేరకు పర్యాటకులను సూర్యలంక బీచ్‌కు ఎప్పుడు అనుమతించేది ప్రకటిస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండు రోజుల నిషేధం: ఆర్డీవో

చీరాల: మొంథా తుపాన్ ప్రభావంతో చీరాల సముద్రతీర ప్రాంతం తీవ్రంగా దెబ్బతిందని, వాడరేవు–రామాపురం ప్రధాన రహదారి దెబ్బతినటంతో రెండు రోజుల పాటు సముద్రం వద్దకు పర్యాటకులు ఎవరూ కూడా తీరానికి రావద్దని ఆర్డీవో చంద్రశేఖర్ అన్నారు.

బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ మొయిన్, జిల్లా పంచాయతీ అధికారి మరియు ఫిషరీస్ ఏడీ, అధికారులు ఉమ్మడిగా చీరాల తీర ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. సముద్రంలో మరియు తీర అంచున గుంటలు ఏర్పడటంతో పాటు సముద్ర ఒడ్డున ఉన్న రహదారి కోతకు గురైనట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీలలో చీరాల మరియు వేటపాలెం సముద్ర తీర ప్రాంతాలలో ప్రజలు, సందర్శకులు ఎవరూ సముద్ర స్నానాలకు రావద్దని అధికారులు స్పష్టం చేశారు. పోలీసు విభాగం గస్తీ కొనసాగిస్తూ ఎవరినీ సముద్ర తీరానికి రానివ్వరని తెలిపారు.

సముద్ర స్నానాలకు అనుమతి లేదు

రేపల్లె: మొంథా తుపాను ప్రభావంతో సముద్రం కోతకు గురైందని అందువల్ల కార్తీకమాసం సముద్ర స్నానాలకు అనుమతి లేదని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. నిజాంపట్నం, దిండి–పరిశావారిపాలెం, నక్షత్రనగర్ బీచ్‌లో సముద్ర స్నానాలకు అనుమతి లేదన్నారు.

తుపాన్ బాధితులకు

తక్షణ సాయం అందించాలి: సిపిఎం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మొంథా తుఫాను తాకిడికి గురైన ఒంగోలు నగర బాధితులందరికీ తక్షణ సాయం అందించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం నాడు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ ప్రభావంతో ఒంగోలు నగరంలోని 15 డివిజన్ల పరిధిలోని 54 కాలనీలు ముంపుకు గురై సుమారు 25 వేల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. ఒక వైపు వర్షపు నీరు, మరో వైపు వరద నీటితో వేలాది ఇళ్లు ముంపుకు గురై ప్రజలు కట్టుబట్టలతో మిగిలి పోయారని గుర్తు చేశారు. ఇళ్లల్లో నిత్యావసర వస్తువులు బియ్యం, పప్పులు, నూనె, పిల్లల పుస్తకాలు, టీవీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్ మోటార్లు, ఇతర నిత్యావసర వస్తువులు పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. విద్యుత్ నిలిపివేయడంతో దొంగతనాల భయంతో ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లకుండా ఇళ్ల దగ్గరే ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం కేవలం పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు మాత్రమే 25 కేజీల బియ్యం, కొన్ని సరుకులు ఇస్తామని ప్రకటించడం కంటి తుడుపు చర్య అని విమర్శించారు. నగరంలో వేల కుటుంబాలు నష్టపోయినా, వారికి ఎటువంటి సాయం అందలేదని, తుపాను ముగిసి మూడు రోజులు గడిచినా నష్టం అంచనా వేయడం, పూర్తి స్థాయి సర్వే చేయకపోవడం విచారకరమని అన్నారు. పోతురాజు కాలువ ఇరు వైపుల కాలనీలు, బాలాజీ నగర్, తొమ్మిది, పది డివిజన్లలోని కాలనీలు ముంపు తీవ్రంగా ప్రభావం చూపిందని చెప్పారు. ఈ ప్రాంతాలన్నింటినీ సమగ్రంగా సర్వే చేసి ప్రతి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికీ 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు, పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తుఫాను బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వాలు పేదలకు విద్యను దూరం చేసే విధానాలను అమలు చేస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాజర్‌జీ పిలుపునిచ్చారు. విద్యార్థి సమస్యలపై, విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుయాత్ర ఆదివారం ఒంగోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో

ఒంగోలుకు చేరుకున్న బస్సుయాత్ర

ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కాషాయీకరిస్తూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేసి ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్, సహాయ కార్యదర్శులు నాగభూషణం, కుల్లాయి స్వామి, జిల్లా కార్యదర్శి రామాంజి తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ప్రీతమ్ జన్మదినాన్ని పురస్కరించుకొని వంద మందికి బియ్యంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. ఒంగోలు వాసవీ అపార్ట్మెంట్స్‌లో ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వంకాయలపాటి సాంబశివరావు–కవితల కుమారుడు ప్రీతమ్ తరపున ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, నూకతోటి శరత్ బాబు, మారెళ్ల రాజేశ్వరి, వంకాయలపాటి సత్యవతి, అనంతలక్ష్మి, సునీత, ఉష తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

'శ్రీరామ్' ఆధ్వర్యంలో

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ ఆదివారం దేవుడు చెరువు డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఎముకలు మరియు కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 187 మంది పేషెంట్లు పాల్గొన్నారు. వీరికి ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ, హెచ్. బి, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు చేసి.. మందులు కూడా ఉచితంగా అందజేశారు. శిబిరంలో దేవుడు చెరువు డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొప్పోలు సుగుణాకర్, కోటేశ్వరమ్మ, బాలాజీ, సుధాకర్ రెడ్డి, హైమ, శివ తదితరులు పాల్గొన్నారు. వైద్యులు చాపల శాంత కుమారి, సానల ధీరజ్ బాబు, సౌమిత్ర పల్లవ్, చైతన్య ప్రియ, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు గోపి ,అనిల్, రజనీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంట వరకు ముంగమూరు రోడ్డు, జెడ్‌పి కాలనీ, కొత్త డొంక, జర్నలిస్ట్ కాలనీ, సుబ్బయ్య నగర్, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్, గాంధీనగర్ ఎక్స్టెన్షన్, మర్రి చెట్ల కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ విద్యుత్ డిఇఇ కె.వి.పి.రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైద్యుల కొరతతో అందని అత్యవసర వైద్యం

- అవసరం ఉన్న హాస్పిటల్‌లో కొరత
- మరొకచోట అదనపు సంఖ్యలో వైద్యులు
- రోగులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత వెంటాడుతుంది. ఈ పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం ఒక వైద్యురాలు మాత్రమే ఉన్నారు. దీంతో వైద్యశాలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. అదే కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు వైద్యులు పనిచేస్తున్నారు. వీరిలో ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్ళగా ముగ్గురు వైద్యులు పనిచేస్తున్నారు. కొల్లూరు మండలం దోనేపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు ఇద్దరు వైద్యులను కేటాయించారు. ఆ ఇద్దరు కొల్లూరు పిహెచ్సిలో పనిచేయడం కోసమెరుపు. కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులతో పాటు దోనేపూడి పిహెచ్సికి కేటాయించిన ఇద్దరు వైద్యులు కూడా కొల్లూరులోనే పనిచేయడం, భట్టిప్రోలులో ఇద్దరు వైద్యులు



భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉండగా ఒక వైద్యురాలు ఉద్యోగ విరమణ చేయగా ప్రస్తుతం ఒక వైద్యురాలు మాత్రమే సేవలు అందిస్తున్నారు. దోనెపూడి పిహెచ్సి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో ఇక్కడ కేటాయించిన ఇరువురు వైద్యులను కొల్లూరుకు కేటాయించారు. వీరిలో ఒకరినైనా భట్టిప్రోలకు కేటాయిస్తే సమస్య కొంతవరకు పరిష్కారమైనట్లు అవుతుంది. ఈ సమస్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు తెలిసినప్పటికీ పట్టిపట్టనట్లుగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోనేపూడి పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఇరువురిలో ఒకరినైనా భట్టిప్రోలకి కేటాయిస్తే ఇక్కడ రోగులకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందటానికి అవకాశం ఉందని, ఆ మేరకు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భట్టిప్రోలులో ఇరువురు వైద్యులు లేకపోవడంతో అత్యవసర సమయంలో రోగులు ప్రాథమిక ఆరోగ్య పట్ల నమ్మకం కోల్పోయి ప్రైవేటు వైద్యశాలను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఓ ప్రక్క వర్షాకాలం జ్వరాల సీజన్ కావడంతో రోగులు ప్రతి రోగానికి వైద్యశాలకు వచ్చి తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

2019 నుండి వైద్యశాల్లో జరగని ప్రసవాలు

2019 కోవిడ్ నుండి భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటి వరకు కనీసం ఒక్క ప్రసవం కూడా జరిగిన దాఖలాలు లేవు. గతంలో భట్టిప్రోలు పిహెచ్‌సిలో వైద్యులు సింహాచలం ఉన్న సమయంలో ఇక్కడ వ్యాసక్టమి, క్యూబెక్టమీ ఆపరేషన్లు కూడా చేసేవాళ్ల. కానీ గత ఆరేళ్లుగా ఈ వైద్యశాలలో ఎలాంటి శస్త్ర చికిత్సలు జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా భట్టిప్రోలకు మరో వైద్యుడిని కేటాయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


నిజాంపట్నంలో కురుస్తున్న భారీ వర్షం

ఆకస్మికంగా భారీ వర్షం

ప్రజాశక్తి - నిజాంపట్నం

వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండలు మండిపోగా సాయంత్రం ఆకాశం మేఘావృతమై అకస్మాత్తుగా కురిసిన వర్షం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వర్షం ధాటికి ప్రధాన రహదారులు, సీసీ రోడ్లు జలమయం అయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొంథ తుఫాన్ ప్రభావంతో పంట పొలాల్లో నిల్వ నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమైన రైతులు మళ్లీ కురిసిన ఆకస్మిక వర్షంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈపాటికే దెబ్బతిన్న వరి పంట మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే పంటలు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతుల్లో భయం వ్యక్తమవుతోంది.


అవార్డు అందుకుంటున్న గుంటుపల్లి చందు

అమ్మ ఆశ్రమానికి పురస్కారం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అమ్మ ఆశ్రమానికి అరుదైన పురస్కారం లభించింది. గత ఆరేళ్లుగా వృద్ధులకు అన్నదానం, మహిళల జీవనోపాధి కోసం ఉచిత కుట్టు శిక్షణ, పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందుకు నరసరావుపేటకు చెందిన విశ్వ జనని ఫౌండేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళా నిలయంలో ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం విశ్వజనని సేవరత్న అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సినీ నటులు పృధ్వి, గౌతమ్ రాజు పాల్గొన్నారు.


నీళ్లలోనే రేపల్లె జగనన్న కాలనీ

జగనన్న కాలనీలో కన్నీటి కష్టాలు

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక జగనన్న కాలనీ నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారింది. కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేక వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం కాలనీవాసులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించకపోవడంతో తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా మౌలిక వసతులు కల్పిస్తామంటూ మాజీ సిఎం జగన్ గొప్పలు చెప్పారని అన్నారు. తాగునీటికీ ఇబ్బందులు పడుతున్న ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి బురద రోడ్లలో నీటిలోనే నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు వెలగడం లేదని తెలిపారు. రోడ్ల సౌకర్యం లేక చీకట్లోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

తుపాను బాధితులకు ప్రభుత్వ సాయం


రేపల్లెలో నిత్యవసరాలు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రేపల్లె

మొంథ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా బియ్యం, కందిపప్పు, పంచదార, ఆయిల్ ప్యాక్‌లను పంపిణీ చేస్తున్నట్లు 20వ వార్డు టిడిపి ఇన్చార్జి పంతగాని ప్రేమలతా చార్లెస్ తెలిపారు. బాధిత కుటుంబాలకు దగ్గరుండి నిత్యవసరాలు పంపిణీ చేశారు. ప్రజలకు ఎప్పుడు కష్టాలు వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందించడం శుభపరిణామం అన్నారు. తుఫాను కారణంగా పంటలు, ఇళ్ల దెబ్బతిన్న రైతులు, కూలీలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సహాయం తాత్కాలిక ఉపశమనం మాత్రమే అన్నారు. తుఫానుకు దెబ్బతిన్న ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పంతగాని చార్లెస్ పాల్గొన్నారు.

నిజాంపట్నం : మండలంలోని అడవులు పంచాయతీలో మొంథా తుఫాన్ బాధిత మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందజేశారు. తుఫాను కారణంగా వేటకు వెళ్ళకుండా పునరావాస కేంద్రాల్లో ఉన్న 85 కుటుంబాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్, శివప్రసాద్ సూచన మేరకు ఒక్కో మత్స్యకార కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు రేషన్ షాపు వద్ద అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఓ సుధాకర్, కూచిపూడి మోహనరావు, మోర్ల రాంప్రసాద్, కైతేపల్లి శ్రీనివాసరావు, సూరగాని నాగార్జున, డీలర్ కొక్కిలిగడ్డ సాంబశివరావు పాల్గొన్నారు.


సహాయం అందజేస్తున్న అధికారులు

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - గిద్దలూరు

రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి శాంతమ్మను పట్టణంలోని విశ్వబ్రాహ్మణులను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు దత్తాచారి, సంఘ సభ్యులు ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహక పథకాలు, మహిళల ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలు, రుణ సౌకర్యం, విద్యా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణం, విద్యారుణాలు, స్వయం ఉపాధి వంటి పథకాలు మరింత మంది లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్వబ్రాహ్మణ యువత తమ సామాజిక బాధ్యతను గుర్తించి, సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. సంఘ బలం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విశ్వబ్రాహ్మణులు కలసికట్టుగా ఉంటే ప్రభుత్వ పథకాలు అందరికీ చేరుతాయని అన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ గౌరవాధ్యక్షులు దొడ్డోజు రంగాచారి, సంఘ సభ్యులు కమ్మరి కృష్ణమాచారి, షరాబు నరసింహ చారి, గూడలూరు శంకరాచారి, ప్రొద్దుటూరి సాయికుమార్ ఆచారి, బి గురుస్వామి పాల్గొన్నారు.


చైర్మన్ శాంతమ్మకు స్వాగతం పలుకుతున్న విశ్వబ్రాహ్మణులు



అవార్డు అందుకుంటున్న వాకర్స్ ప్రతినిధులు

వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు

ప్రజాశక్తి - చీరాల

గుంటూరు రింగ్ రోడ్‌లోని సూర్యదేవర కళ్యాణ మండపంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 203 వార్షిక కాన్ఫరెన్స్, అవార్డుల కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా గవర్నర్ పెద్ది శివరామ ప్రసాద్ అధ్యక్షత వహించారు. అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం ప్రభావతి, మాజీ అధ్యక్షులు చెలికాని సీతారామయ్య, నేతాజీ సుబ్బారెడ్డి, మాజీ జిల్లా గవర్నర్ శ్రీనివాసులురెడ్డి, కాబోయే గవర్నర్ బలరామయ్య నాయుడు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 2025లో సేవా కార్యక్రమాల్లో విశేషంగా ప్రతిభ కనబర్చిన చీరాల వాకర్స్ అసోసియేషన్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఎంఆర్‌కె మెమోరియల్ స్పెషల్ అవార్డును పురస్కార గ్రాహకుల కుటుంబ సభ్యులు స్వీకరించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, రంగా హనుమంతరావు, పూర్ణా, చక్క నారాయణ, చెంగలరాయుడు, లాల్, రమేష్, శ్రీనివాసరావు, రవి, భాస్కర్, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.


శ్రమదానం చేస్తున్న ఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది

ఉపాధి సిబ్బంది శ్రమదానం

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక ఉపాధి కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లను కార్యాలయ సిబ్బంది శ్రమదానం చేసి ఆదివారం తొలగించారు. కూలీల చేత పనిచేయించే వీళ్ళు వళ్లు వంచి ఎండలో పనిచేయటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇదే విషయాన్ని ఎపిఎం సంతోషంతో 'ప్రజాశక్తి' ప్రస్తావించగా మనపని మనం చేసుకోవటంలో తప్పు లేదని అన్నారు. పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు ఉండటంతో పాములు, ఇతర విషపురుగులు చేరుతున్నాయని అన్నారు. అ పరిశుభ్రంగా ఉంటుందని, అందుకే పరిశుభ్రంగా ఉంచాలని పని చేశామని అన్నారు. ఇందులో తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఉప్పరపాలెం గేటు' కష్టాలు తీరేదెన్నడో.?

ప్రజాశక్తి - బాపట్ల

పాలకులకు ప్రజా సమస్యలు పట్టడం లేదు. ప్రభుత్వాలు మారుతున్న ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదు. పట్టణంలో ఏడు వార్డుల ప్రజలు రాకపోకలు కొనసాగించే ఉప్పరపాలెం రైల్వే గేటుతో ప్రతినిత్యం ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉప్పరపాలెం రైల్వే గేట్ సమస్యపై ప్రజాప్రతినిధులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. గత వైసిపి ప్రభుత్వంలో ఉప్పరపాలెం రైల్వే గేట్ స్థానంలో అండర్ పాస్ నిర్మించాలని పురపాలక అధికారులు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత దాన్ని గాలికి వదిలేసారు. విజయవాడ, చెన్నై రైల్వే మార్గంలో 3వ రైల్వే లైన్ వేశారు. దీంతో రైళ్ల రాకపోకల సంఖ్య మరింత పెరిగింది. ఒక్కసారి గేటు వేస్తే అరగంట నుండి గంటకుపైగా గేటు తీయడం లేదు. ప్రతినిత్యం ఈ గేటు ద్వారా రాకపోకలు కొనసాగించే ప్రజలు గంటల తరబడి వేచి ఉండలేక విసుగెత్తి పోతున్నారు. 24 గంటల్లో 12 గంటల గేటు వేసి ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు కొనసాగించే ప్రజల విలువైన సమయం వృధా అవుతుంది. ఒక్కొక్కసారి ఆటోలో బస్సుల్లో పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు గంటలు తరబడి ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే ఈ గేటు ద్వారా ప్రయాణం పెద్ద సమస్యగా మారుతోంది. కూటమి


ఉప్పరపాలెం రైల్వే గేట్ దగ్గర వేచి ఉన్న వాహనదారులు

ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తోంది. శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఈ రైల్వే గేటు సమస్యపై దృష్టి పెట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రైల్వే శాఖతో ముడిపడి ఉన్న ఈ గేటు విషయం ఎంపీ కన్నీటి కృష్ణ ప్రసాద్ సైతం పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని, ఈ మార్గంలో రాకపోకలు కొనసాగించే ప్రజలు అనేక విమర్శలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పొంచి ఉన్న ఈ సమస్యను శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ దీన్ని పట్టించుకోకపోవడంతో ప్రజా ప్రతినిధుల పనితీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. రైల్వే అధికారులతో సంప్రదించి ఉప్పరపాలెం రైల్వే గేట్ ద్వారా రాకపోకలు కొనసాగించే ప్రజల సమస్య పరిష్కారం దిశగా యోచిస్తారని ఆశలు సన్నగిల్లుతున్నాయి. బాపట్లకు సందర్శించిన సమస్యను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలుగుతున్నాయి. ప్రధానంగా బాపట్లలో ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం, సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదనే ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు రైల్వే స్టేషన్ ఆధునికరణలో భాగంగా రైలుపేట నుండి పట్టణంలోకి ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాంపై ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఫుట్ బ్రిడ్జిని సగం వరకు తొలగించారు. తిరిగి దాని నిర్మాణాన్ని వదిలేశారు. రైలుపేట నుండి పట్టణంలోకి వచ్చే ప్రజలకు ఇదొక పెద్ద సమస్యగానే ఉంది. రైలుపేట ప్రజలు పలుమార్లు ఈ కాలినడక బ్రిడ్జిని నిర్మించాలని రైల్వే అధికారులు విజ్ఞాపనలు అందజేశారు. రైల్వే అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలో రైలుపేట వాసులు పట్టణానికి రావాలంటే రైల్వే స్టేషన్ వద్ద కాలినడక బ్రిడ్జి లేక ఉప్పరపాలెం రైల్వే గేటు సమస్యతో ప్రజలు ప్రతినిత్యం అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ సమస్యలపై ప్రజలు సమర్పించిన విజ్ఞాపనలు బుట్ట దాఖలు అవుతున్నాయే తప్ప వాటిపై కనీసం పరిశీలన లేకపోవడం ప్రజా ప్రతినిధుల పనితీరుకు అద్దం పడుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఉప్పరపాలెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం, రైలుపేట నుండి పట్టణానికి రాకపోకలు కొనసాగించే రైల్వే స్టేషన్ వద్ద కాలినడక బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

'నల్లమడ ఆధునీకరణ'లో తీవ్ర నిర్లక్ష్యం.!

- ప్రతి ఏటా పంటలను ముంచెత్తుతున్న వరద
- వందలాది ఎకరాల్లో పంట నష్టపోతున్న రైతులు
- గండ్లు పడిన ప్రాంతాల్లో ఇసుక బస్తాలతో సరి
- పూర్తి స్థాయిలో నల్లమడ ఆధునీకరించాలని వినతి

ప్రజాశక్తి - బాపట్ల

నల్లమడ రైతుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. వేలాది ఎకరాల పంటలు వరద ముంపుకు గురవుతున్నాయి. పంటలు కాపాడాల్సిన పాలకుల నిర్లక్ష్యానికి గురై వందలాది ఎకరాల్లో వ్యవసాయ పంటలు వరద ముంచే యడంతో రైతులకు రూ.కోట్లలో నష్టం పోతున్నారు. అధిక వర్షాలకు నల్లమడ డ్రెయిన్‌కు వరదలు సంభవిస్తే కట్టలు తెగిపోతున్నాయి. దీంతో పంట పొలాలు నీట మునిగి రైతులకు కన్నీళ్లు తెప్పిస్తుంది. తాజాగా మొంథా తుఫానుకు నల్లమడ డ్రెయిన్‌కు గుంటూరు జిల్లాల్లో ఎడమ కట్టకు గండ్లు పడ్డాయి. కట్టలు తెగి గుంటూరు జిల్లా కొండపాటూరు, కాకుమాను, రేటూరు. బాపట్ల జిల్లాలో కుడికట్టకు మూలపాలెం, జిల్లెళ్ళమూడి గ్రామాల సమీపంలో గండ్లు పడటంతో వరి పైరు నీట మునిగింది. వరదలు సమయంలో గండ్లు పడిన ప్రాంతాల్లో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. శాశ్వత మరమ్మత్తులు చేపట్టాల్సిన పాలకులు, అధికారులు పట్టించుకోవడం


కాలువ గండికి అడ్డువేసేందుకు సిద్ధం చేసిన ఇసుక బస్తాలు

లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులను నష్టాల బారి నుండి కాపాడాల్సిన ప్రభుత్వం గాలికి వదిలేసింది. పాలకూలకే పట్టని ఈ డ్రైన్ మరమ్మత్తుల సంగతి తమకెందుకులే అని అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలో నరసరావుపేట ప్రాంతంలో ఆరంభమైన ఓగేరు వాగు పెదనందిపాడు వద్ద నక్క వాగుతో కలిసి నల్లమడగా మారి బాపట్ల మండలం ముత్తాయపాలెం, సూర్యలంక సమీపంలో సముద్రంలో కలుస్తుంది. దీని పరివాహక ప్రాంతంలో 1.20 లక్షలు ఎకరాలకు మురుగు నీటి సౌకర్యాన్ని కల్పించే ఈ డ్రెయిన్‌పై అనేక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల ద్వారా వ్యవసాయ క్షేత్రాలను సస్య శ్యామలం చేస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసే అధిక వర్షాలకు వరదలు సంభవించి గుంటూరు జిల్లా కాకుమాను, కొండపాటూరు, రేటూరు గ్రామాల సమీపంలో ఎడమకట్ట, బాపట్ల జిల్లా జిల్లెళ్ళమూడి, మూలపాలెం ప్రాంతాల్లో కుడికట్టకు గండ్లు పడి వందల ఎకరాల వరి పంటను ముంచెత్తుతోంది.

అక్రమంగా మట్టి తవ్వకాలే ప్రమాదం

అక్రమంగా మట్టి తవ్వకాలే కట్టలు తెగేందుకు ప్రధాన కారణమని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై అధికారులు చేసిన పాపం రైతులకు శాపంగా మారింది. గతంలో చంద్రబాబు సిఎంగా ఉన్న కాలంలో నల్లమడ ఆధునీ కరణకు రూ.375 కోట్లు కేటాయించారు. ఆ ప్రభుత్వంలో దీని పనులు ప్రారంభించలేదు. తిరిగి వైసిపి ప్రభుత్వం వచ్చాక అసలు పట్టించుకున్న వారే లేరు. వరదల తాకిడికి కట్టలు బలహీనపడడంతో కట్టలు తెంచుకొని వరద పంట పొలాలపై పొర్లి నష్టాలపాలు చేస్తుందన్న రైతుల గోడు పట్టించుకునే వారు లేరు. నల్లమడ సముద్రంలో కలిసే చోటు 300 నుండి 500 క్యూసెక్కుల వరకు నీటి ప్రవాహానికి అనువుగా ఆధునికరించే విధంగా నల్లమడ అభివృద్ధి కమిటీ ప్రభుత్వానికి విజ్ఞాపన అందించారు.

ఎప్పటికప్పుడు ఇసుక బస్తాలతో సరి

గత నాలుగేళ్లలో కట్టలు తెగిడం ఇది మూడోసారి. ఎప్పటికప్పుడు ఇసుక బస్తాలు అడ్డం వేసి తాత్కాలికంగా పబ్బం గడుపుకుంటున్నారు. పూర్తిస్థాయిలో దీనిపై దృష్టి కేంద్రీకరించి ఆధునికరించి పంట పొలాలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రియల్‌ఎస్టేట్ కోసం వాగుపై రోడ్డు నిర్మాణం

- ఆక్రమణకు గురైన ముదిగొండ వాగు
- నేల చప్టాలపై ప్రవహిస్తున్న వర్షపు నీరు
- పొలాలు మునుగుతున్న వైనం

ప్రజాశక్తి - మద్దిపాడు

సాధారణంగా చిన్నపాటి వర్షం పడిన ముదిగొండ వాగు పొంగి పొర్లుతుంది. అలాంటిది రియల్ ఎస్టేట్ వెంచర్లోకి వెళ్లేందుకు ఏకంగా ఆ వాగును పూడ్చి రోడ్డు వేశారు. నీటి ప్రవాహానికి అడ్డుగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఎగువ ప్రాంతాల్లోని నేల చప్టాల వర్షపు నీరు ప్రవహిస్తుంది. దీనివలన రాకపోకలకు తీవ్ర సమస్య ఎదురవుతుంది. అదే క్రమంలో పొలాలు మునగడం, ఇళ్లల్లోకి నీరు చేరడం వంటి సమస్య తీవ్రమైంది. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని దొడ్డవరప్పాడు గ్రామ పరిధిలో ఏడుగుండ్లపాడుకు వెళ్లే డొంక రోడ్డులో


వాగును పూడ్చి రోడ్డు నిర్మించిన దృశ్యం

ఆర్చి వైపున ఓ వెంచర్‌లోకి వెళ్లేందుకు ఏకంగా ముదిగొండ వాగును పూడ్చి రోడ్డు వేశారు. వాగుకు ఇరువైపులా బాగా ఎత్తులో ఉన్న కట్టలను సైతం పగలగొట్టి వెడల్పుగా వెంచర్‌లోకి రోడ్డు వేశారు. ఈ రోడ్డుకు కింది బాగాన చిన్నపాటి తూములు నాలుగు వేసి చక్కగా వాగుకు అవతల వైపున ఉన్న వెంచర్‌లోకి వెళ్ళేందుకు రాచ మార్గమే ఏర్పాటు చేసుకున్నారు. దీంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఏర్పడింది. వర్షాలు పడే సమయంలో ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు సరిగ్గా ప్రవహించడం లేదు. నీరు కిందకి వెళ్ళేందుకు వీలు కాకపోవడంతో ఎగువన పెద్దకొత్తపల్లి, గురవారెడ్డిపాలెం వద్ద ఉన్న వాగులు పొంగి పొర్లడంతో పొలాలు మునిగి పోతున్నాయి. ఇళ్లల్లో కూడా నీళ్లు చేరుతున్నాయి. మొంథా తుఫానుకు వర్షపు నీరు దొడ్డవరప్పాడు గ్రామాన్ని తాకాయి అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాగును ఆక్రమించి రోడ్డు వేసినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎవరు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన వాగును పునరుద్ధరించాలని, ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే కొండయ్యకు ఘన సన్మానం

ప్రజాశక్తి - చీరాల

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలతో కుటుంబ సభ్యునిలా కలిసిపోయి సహాయక చర్యలు సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎమ్మెల్యే కొండయ్యకు సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు లభించిన సందర్భంగా గడియార స్థంభం సెంటర్లోని ఫ్రెండ్స్ ఆదివారం పూలమాలతో ఘనంగా సన్మానించారు. తుఫాన్ సమయంలో ప్రజల పట్ల చూపిన అపారమైన సేవాభావాన్ని సీఎం ప్రత్యేకంగా అభినందించారని అన్నారు. కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం కార్యక్రమంలో ఆక్కిశెట్టి పుల్లయ్య, సర్విశెట్టి సుబ్బరామయ్య, వడ్లమూడి ఆదినారాయణ, జంగిలి సుబ్రహ్మణ్యం, హోటల్ నరసయ్య, జొన్నాదుల శ్రీనివాసరావు, రాజు, పులి నారాయణ పాల్గొన్నారు.


స్వామిగుప్తా ఆరాధనలో భక్తులు

ఘనంగా ఆరాధన

ప్రజాశక్తి - వేటపాలెం

గుప్త పంచాంగ సృష్టికర్త దోగుపర్తి స్వామి గుప్తా సిద్ధాంతి 36వ ఆరాధన మహెూత్సవం స్థానిక రావూరిపేటలోని శ్రీ నాగానంద స్వామి ఆశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగానంద స్వామికి, స్వామి గుప్తా చిత్రపటాలకు పూల మాలు వేసి పూజలు, భజన నిర్వహించారు. తదనంతరం అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు దేవన నాగేశ్వరరావు, దేవన తులసీప్రసాద్, గుత్తి మోహనరావు, దేవన భాస్కరరావు, పింజల భాస్కరరావు, వీరబ్రహ్మం, ఉమామహేశ్వరరావు, శీరాం గోవర్ధనరావు, పొన్నూరి రమేష్, గట్టా రమేష్, కొత్త వాసు పాల్గొన్నారు.

ఆదరణ కోల్పోతున్న రిక్షా కార్మికులు

ప్రజాశక్తి - యద్దనపూడి

ఆటోలు, ఇతర ప్రయాణ సాధనాలు వచ్చిన తర్వాత రిక్షా కార్మికులకు ఆదరణ తగ్గిపోయిందని మండలంలోని సూరవరపుపల్లికి చెందిన రిక్షా కార్మికుడు కంప వెంకట కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గు అమ్ముకుని జీవనం సాగిస్తున్నట్లు ఆయన ప్రజాశక్తికి తెలిపారు. తమ సొంత ఊరు నర్సరావుపేటని తెలిపారు. తన చిన్నతనంలో తన సోదరి రమణను చిలకలూరిపేట ఇచ్చి తల్లిదండ్రులు వివాహం చేశారని అప్పట్లో ఆమెకు తోడుగా వచ్చి చిలకలూరిపేటలో ఉంటూ తొలుత గూడు రిక్షా తొక్కవాడ నని చెప్పారు. తరువాత గూడు రిక్షాకు రిరాకి తగ్గడంతో ఇనుప కోట్లు, చిల్లర కోట్ల వద్ద బల్ల రిక్షా పెట్టుకొని కొంత కాలం జీవనం సాగించానని చెప్పాడు. ఆటోలు ఎక్కువై దానికి కూడా ఆదరణ తగ్గడంతో అదితీసివేసి బియ్యం, నూకలకు ఉప్పు, ముగ్గు, కోడిగ్రుడ్లు అమ్ముకుటునాన్ని చెప్పాడు. ప్రస్తుతం 60 ఏళ్ల తనకు సొంత ఇల్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు పరిశీలించి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

నేడు చినగంజాంలో ఏలూరి పర్యటన

ప్రజాశక్తి - చినగంజాం

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేడు సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామస్వామి దేవస్థానం శంకుస్థాపనలో పాల్గొంటారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలు పరిశీలిస్తారని తెలిపారు.

దాచూరి రామిరెడ్డి

మెడికల్ క్యాంపుకు విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మెడికల్ క్యాంపులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

దాచూరి రామిరెడ్డి రెగ్యులర్ మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఐదు గంటలకే నిర్వాహకులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు జిబిఆర్ ఫౌండేషన్ సహకారం, యుటిఎఫ్ సౌజన్యంతో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెడికల్ క్యాంపుకు 1,547 మంది పేషెంట్లు హాజరై వైద్యసేవలు పొందారు. ఈ క్యాంపునకు ప్రముఖ వైద్యులు డా.గోపాళం శివన్నారాయణ, డా.బి. హరిబాబు, డాక్టర్ యల్.జాన్ రిచర్డ్స్, డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి, డాక్టర్ ఎస్. ధీరజ్ బాబు, డాక్టర్ ఎం.శరత్, డాక్టర్ రంజిత్ బాషా,డాక్టర్ ఎస్.కె సమీర్ శర్మ,డాక్టర్ ఎం రవితేజ, డాక్టర్ రఘుచంద్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ క్యాంప్‌లో 2 నెలలకు సరిపడా మందులు రూ.200కు అందజేశారు. అవసరమైన రోగులకు అతి తక్కువ ధరకు ఇన్సులిన్ అందజేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కన్వీనర్ మాదాల వెంకటరావు మాట్లాడుతూ వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో తక్కువ ఖర్చుతో పేదలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో మెడికల్ క్యాంపును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు రూ.20 వేలు అందించిన ప్రకాశం జిల్లా హెడ్ మాస్టర్స్ అసోసియేషన్‌కు, రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్(చీమకుర్తి), డాక్టర్ ఎం రవితేజ, రాపర్లకు చెందిన ఢాకా చింపిరిరెడ్డి, వెంకమ్మల జ్ఞాపకార్థం అందించిన ఢాకా సుబ్బారెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణలో రిజిస్ట్రేషన్, టెక్నికల్, ఫార్మసీ, కౌన్సిలింగ్ వంటి విభాగాలలో స్వచ్ఛందంగా సేవలందించిన 120 మంది ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను వెంకట్రావు అభినందించారు.



కొవ్వొత్తుల ర్యాలీలో బూచేపల్లి, వైసిపి నాయకులు

'కాశీబుగ్గ' భక్తుల మృతికి సంతాపంగా

వైసిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి గుడిలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన తొమ్మిది మంది భక్తులకు సంతాపంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రాత్రి ఒంగోలు బాపూజీ మార్కెట్ వద్ద ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు డా. బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి నేతృత్వంలో ఈ ర్యాలీ నిర్వహించారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ ధైర్యం ప్రసాదించాలని నేతలు ఆకాంక్షించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ పాలనలో జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవి బాబు, మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు బోట్ల రావురావు, వై. వెంకటేశ్వర్లు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాద్, పట్టణ అధ్యక్షులు కటారి శంకర్, దుంపా రవణమ్మ, గాయం సావిత్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో మరియు మండల తహశీల్దార్ల కార్యాలయాలలోను తహశీల్దార్లు, ఎంపీడిఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని చెప్పారు.

పశ్చిమాన.. పంట నష్టం అపారం

- క్షేత్ర స్థాయిలో రైతుసంఘం బృందం పర్యటన
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-మార్కాపురం



పత్తి పంటను పరిశీలిస్తున్న వి.కృష్ణయ్య, నాయకులు

పశ్చిమ ప్రకాశంలో మొంథా తుపాను అపార నష్టం కలిగించింది. అన్ని రకాల పంటలను నాశనం చేసింది. ప్రధానంగా పత్తి, మిర్చి సాగు పనికిరాకుండా పోయింది. ఆ రెండు పంటలు మార్కాపురం ప్రాంతంలో అధిక సాగుబడిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న పంట నష్టాలు, రైతన్నల అవస్థలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్యతో పాటు ప్రతినిధి బృందం సభ్యులు ఆదివారం పర్యటించారు. మార్కాపురం మండలంలోని నికరంపల్లి, పెద్ద నాగులవరం, వేములకోట ఇలాఖాల్లోని పంట పొలాలను సందర్శించారు. అక్కడి రైతులతో ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం మాట్లాడింది. బాధిత రైతులతో కలిసి పత్తి, మిర్చి, ఇతర పంటలను పరిశీలించారు. పత్తి పంటలో తీరని నష్టం జరిగింది.

నికరంపల్లి గ్రామానికి చెందిన దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి అనే రైతు 35 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ఒక్క ఎకరంలో కూడా పైసా కూడా తిరిగి వచ్చేలా కనిపించడం లేదు. పీకుడు దశలోని పత్తి వర్షానికి తడిసిపోయింది. మిగిలిన కాయలు కుళ్లిపోయాయి. పత్తి కాయ లోపల కూడా తడిసి ముద్దవ్వడంతో మళ్లీ పత్తి మొలక వస్తోంది. అధిక వర్షం కారణంగా పత్తి ఇలా ఉందంటే ఎందుకూ పనికి రాదు. ఒక్కో ఎకరానికి రూ.35 వేలు తగ్గకుండా పెట్టుబడి పెట్టినట్లు బాధిత రైతు శ్రీనివాసరెడ్డి రైతు సంఘం నేత కృష్ణయ్య ఎదుట వాపోయాడు. సొంత పొలం ఐదు ఎకరాలు కాగా.. మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేసినట్లు చెప్పాడు. ఒక్కో ఎకరానికి రూ.5 వేలు కౌలు కలుపుకుంటే రూ.40 వేలు పెట్టుబడి అవిరైందన్నారు. మొత్తంగా రూ.14 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. కష్టం పోయిందని, పెట్టుబడి పోయిందని, తాను కోలుకోవడం కూడా కష్టమేనని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆ తరువాత మిర్చి పంటను పరిశీలించారు. అధిక వర్షం కారణంగా మిర్చి మొక్కలు చనిపోయినట్లు రైతులు చెప్పారు. నీరు చచ్చుతో నష్టం జరిగిందన్నారు. ఒక్కో ఎకరం మిర్చి సాగులో ఇప్పటి వరకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు చెప్పారు. పూత, పిందె దశలో ఉన్న మిరప సాగు ఎడతెరపి లేని వర్షాలతో దెబ్బతిందన్నారు. మిర్చి సాగు ఎకరంలో సగం పైగా దెబ్బతిందన్నారు. మిగిలిన కంది, మినుము, మొక్కజొన్న తదితర పంటలు కూడా ఆనవాళ్లు లేకుండా పోయాయి. మొత్తంగా అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయి.

ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య మాట్లాడుతూ తీరని నష్టాన్ని రైతులు భరించాల్సి వచ్చిందన్నారు. మొంథా తుపానుతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వమే పూడ్చాలన్నారు. రైతులు అందరూ దెబ్బతిన్నట్లు చెప్పారు. ఏ ఒక్క రైతు కూడా పెట్టుబడి తీయలేరన్నారు. గత 20 ఏళ్లలో ఇంతటి వర్షం చూడలేదని ఇక్కడి రైతులు చెప్పారన్నారు. జిల్లా యంత్రాంగం అంతా పర్యటించడంతో సరిపెట్టొద్దన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు కూడా రైతన్నల విషయంలో సీరియస్‌గా తీసుకోవాలన్నారు. పత్తి పంటకు ఒక్కో ఎకరానికి రూ. 30వేలు తగ్గకుండా పరిహారం ఇవ్వాలన్నారు. మిర్చి సాగు చేసిన ప్రతి ఎకరానికి రూ. 50వేలు తగ్గకుండా నష్టపరిహారం అందజేయాలన్నారు. మిగిలిన పంటలకు ఎకరానికి రూ. 10వేల చొప్పున ఇవ్వాలన్నారు. ఆ విధంగా ఆదుకోకపోతే రైతన్నలు కోలుకోవడం కష్టమన్నారు. కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని, సాగులో ఉన్న కౌలు రైతుకు మాత్రమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సాయం అందించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తే మాత్రం రైతులను, కౌలు రైతులను ఏకం చేసి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎపి రైతు సంఘం నాయకులు డి.సోమయ్య, యేర్వ పాపిరెడ్డి, ఓర్సు అడివయ్య, గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి, జనమాల నాగయ్య, పెద్ద నాగులవరం మాజీ సర్పంచి పిన్నిక అల్లూరయ్య తదితరులు ఉన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం..

- పంట నష్టంపై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు
- ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలు
- జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ఇటీవల కురిసిన భారీ వర్షాలు, మొంథా తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 11,687 హెక్టార్లల్లో రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంటల నష్టంపై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఇన్‌పుట్ సబ్సిడీ కోరుతూ ప్రభుత్వానికి సిఫారసులు చేశాం. ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం రైతులకు ఖాతాలకు చేరనుంది. జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా రైతుల సంక్షేమానికి చేస్తున్న కృషి, అందిస్తున్న రాయితీలను డిఎఒ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఇటీవల వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలు, మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపట్టాం. ఖరీఫ్ రబీ సీజన్‌లలో వారికి అవసరమైన విత్తనాలు, రాయితీలు, ఎరువులు, పురుగు మందులు, అందించేందుకు కృషి చేస్తున్నాం. భూసార పరీక్షలతో పాటు, ఈ-క్రాప్ నమోదు, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలను వ్యవసాయ శాస్త్రవేత్తలు అందిస్తున్నారు

పంట నష్టం

మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో రైతులు సాగు చేసిన 11,687 హెక్టార్లల్లో వివిధ పంటలకు నష్టం జరిగింది. ప్రధానంగా వ్యవసాయ పంటలు వరి, సజ్జ, మొక్కజొన్న, జొన్న, పొగాకు, పత్తి, మినుములు, కందులు, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని 23 మండలాలలోని రైతులు నష్టపోయారు. ఆయా పంట పొలాలలో నీరు నిల్వ ఉండటంతో తొలగించుకొని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించాం. అన్ని మండలాలలోని వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రి అసిస్టెంట్లు రైతులను కలసి పంటలకు సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు

మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతినటంతో ఎన్యుమరేషన్ చేపట్టి కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశాం. ఆయా పంటలకు ఇవ్వాల్సిన నష్టపరిహారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. తరువాత నష్టపరిహారం రైతుల ఖాతాలలో జమ అవుతోంది.

అందుబాటులో ఎరువులు

రబీ-2025లో రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఎరువుల విని యోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది మొత్తం 54,468 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయి. 2025 ఏప్రిల్ నెల 1 నాటికి మిగిలిన ఎరువులు 27,111 మెట్రిక్ టన్నులు మొత్తం 71,881 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు 50,000 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించారు. మెట్రిక్ అవసర మైన ఎరువులు వివిధ కేంద్రాలలో ఉన్నాయి. యూరియా ప్రైవేట్ హోల్‌సేలర్స్, ఏపి మార్క్‌ఫెడ్, ఏఆర్ఎస్‌కె/ఎఫ్‌పిఒలు, సొసైటీలు, ప్రైవేట్ రిటైలర్స్, రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రబీ సం బంధించి అవసరమైన ఎరువులు రైతులకు అం దించేందుకు చర్యలు తీసుకుంటున్నా. ఆయా పంటలకు ఎరువుల వినియోగంపై ఓట్ రీచ్ ప్రోగ్రామ్‌లో అవగాహన కల్పిస్తున్నాం.